18వ వసంతంలోకి
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
శనివారం | 12 ఏప్రిల్ 2025 | పేజీలు 8

## స్వర్ణరథంపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి కటాక్షం



**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాల్లో భాగంగా రెండవరోజైన శుక్రవారం ఉదయం మలయప్పస్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా తిరుమాడ వీధుల్లో స్వర్ణరథంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఇందులో భాగంగా ఉదయం 8 నుండి 10 గంటల నడుమ అత్యంత వైభవంగా సాగిన స్వర్ణరథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని గోవిందనామాలు జపిస్తూ రథాన్ని లాగారు.స్వర్ణరథోత్సవాన్ని దర్శించడం వల్ల లక్ష్మీ దేవి కరుణతో సంపదలు, భోగభాగ్యాలూ, భూదేవి కరుణతో, సమస్తధాన్యాలూ, శ్రీవారికరుణతో సర్వ శుభాలూ, సుఖాలూ చేకూరుతాయని భక్తుల విశ్వాసం. ఈ  కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, డిప్యూటీ ఈఓ లోకనాథం, వీజీఓ సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బీసీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది

**చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** వెనుకబడిన వర్గాల అభివృద్ధికి మహాత్మా జ్యోతిబా పూలే ఎనలేని కృషి చేశారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జ్యోతిబా పూలే 199 వ జయంతి ని పురస్కరించుకుని చిత్తూరు పట్టణం గాంధీ విగ్రహ కూడలి నందు ఏర్పాటు చేసిన జ్యోతిబా పూలే విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ మనదేశంలో వెనుకబడిన వర్గాల వారి ఆశాజ్యోతిగా జ్యోతిబా పులే ఉన్నారన్నారు. జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా ఆయన చేసిన కృషిని మన మందరం గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఘనంగా జ్యోతిబా పులే 199వ జయంతి కార్యక్రమంను అధికారికంగా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమం ద్వారా దాదాపు 500 మందికి ప్రభుత్వం తరపున రుణాల మంజూరు చేయడం జరుగుతుందన్నారు. బీసీల ఆర్థికాభివృద్ధికి భవిష్యత్తులో తీసుకోవలసిన కార్యాచరణ కూడా

మిగతా 2లో



## నామినేటెడ్ పదవులపై.. కూటమిలో

కూటమి నేతల్లో నామినేటెడ్ పదవులపై నెలకొన్న ఉత్కంఠ పరిస్థితి

నాయకుల్లో కేడర్ కావాలంటే ఏదో ఒక పదవి ఉండాల్సిందే



# కుర్చీల కుమ్ములాట

- పలుకుబడి కావాలంటే పవర్ ఉండాల్సిందే రా
- మార్కెట్ కమిటీల్లో ఆచితూచి..
- మిగతా వాటి భర్తీలోనూ అందరికీ ఆశలు
- కార్పొరేషన్ల పదవుల కోసం పోటా..పోటీ
- సామాజికవర్గ ప్రామాణికం వద్దు
- పనితనాన్ని బట్టి పదవులు ఇవ్వాలంటున్న నేతలు
- తమకూ అవకాశం కల్పించాలంటున్న బీజేపీ, జనసేన పార్టీ కేడర్ నాయకులు

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఎడాది కాలం సమీపిస్తుండడంతో ఈలోగా నామినేటెడ్ పదవుల భర్తీ పూర్తిచేయాలన్న సంకల్పంతో ముందుకు పోతున్నారు కూటమినేత అధినాయకులు. ఇప్పటికే మూడుదశల్లో పదవుల పందేరం జరిగింది. ఉమ్మడి తిరుపతి జిల్లాలో కీలక నేతలకు పదవులు దక్కకపోవడంతో వారంతా మిగిలిన పదవులపై ఆశలు పెంచుకున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీ మరింత వేగవంతం కాబోతుందన్న సమాచారం ఉత్కంఠను రేపుతోంది. ఇప్పటికే ఉగాదికి ముందే మార్కెట్ కమిటీ చైర్మన్ల తొలిజాబితా విడుదలైంది. సమాంతరంగా దేవాలయ కమిటీలు, సహకార సంఘాల త్రిసభ్య కమిటీలు, కీలకమైన మరికొన్ని కార్పొరేషన్ల పోస్టులను భర్తీ చేయబోతున్నారు. జిల్లాలో ఐదు వేల మందికిపైగా తమకు మంచి అవకాశం ఇవ్వాల్సిందిగా తెలుగుదేశం పార్టీ అధిష్ఠానంకు దరఖాస్తు

మిగతా 8లో

## జ్యోతిబా  చిత్రపటానికి ఎస్పీ పుష్పాంజలి

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో మహాత్మా జ్యోతిబా పూలే  చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహాత్మా పూలే  ఏప్రిల్ 11, 1827న మహారాష్ట్రలోని సతారా జిల్లాలో జన్మించారు. మహాత్మా జ్యోతిబా పూలే సంఘ సంస్కర్త, కుల వ్యతిరేక కార్యకర్త, ఆలోచనాపరుడు రచయిత, జ్యోతిబా పూలే. అతను విద్య వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, అంటరానితనం కులవ్యవస్థ నిర్మూలనకు కృషి చేశారు. 1848లో తన భార్య సావిత్రీబాయి పూలే తో కలిసి పూణేలో బాలికల కోసం పాఠశాల ను ప్రారంభించిన మొదటి వ్యక్తి, ఇది భారతదేశంలో మహిళా విద్యకు విప్లవాత్మక అడుగు అని, ఆడ శిశువుల హత్యలకు వ్యతిరేకంగా తన గళాన్ని వినిపించారని, సామాజిక న్యాయం కోసం పోరాడిన విజేతగా, అసంఖ్యాక ప్రజలకు ఆశాజనకంగా సామాజిక సమానత్వం, మహిళా సాధికారత విద్యను పెంపొందించడం కోసం అవిశ్రాంతంగా కృషిచేశారని ఎస్పీ  కొనియాడారు. అప్పట్లో నీటిఎద్దడిని అధిగమించేందుకు, నీటి సంక్షోభం పరిష్కారానికి ఉద్యమాలు చేసిన గొప్ప ఆలోచనాపరు డు జ్యోతిబా పూలే అని అన్నారు. దోపిడీకి గురైన కులాల వ్యక్తులకు సమాన హక్కులు సాధించడం సమాజ లక్ష్యంగా జ్యోతిబా పూలే  తన అనుచరులతో కలిసి 'సత్యశోధకుల సంఘం' లేదా 'సత్యశోధక్ సమాజ్'ని స్థాపించి నవ భారతావని నిర్మాణానికి విశేష కృషి చేశారని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, డిఎస్పీ చంద్రశేఖర్, ఆర్ఐలు, రమణారెడ్డి, రమణ, శివారెడ్డి, ఆర్ఎస్ఐలు, పుల్లన్న, నభియా పాల్గొన్నారు.



## ప్రభుత్వం అన్ని విధాల సహకారం... మీ సహకారమేది

**యువగళంలో యువతకు హామీ అమలు చేయకుంటే ఆందోళన తీవ్రం**

**ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్**

**గూడూరు, మేజర్‌న్యూస్:** ప్రభుత్వం పారిశ్రామికీకరణకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నా పరిశ్రమలు ఆ విధంగా ప్రభుత్వం లక్ష్యాలు అందుకోవడం లేదని ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. చిల్లకూరు మండలం తమ్మినపట్నం గ్రామం వద్ద ఉన్న జిందాల్ పవర్ పరిశ్రమ ఎదుట నిరుద్యోగ యువత నిర్వహించిన శాంతియుత ప్రదర్శనలో పాల్గొన్నారు. ఎంఎల్ఏ మాట్లాడుతూ తీరప్రాంత గ్రామాల్లోని పేదల భూములను పరిశ్రమల కోసం సేకరించి కేటాయిస్తే ఆ పరిశ్రమలు భూ నిర్వాశితులకు మొండి చేయి చూపడం విడ్డూరమన్నారు. పరిశ్రమల్లో అవసరమైన ఉద్యోగులు, కార్యికులను స్థానికంగా ఉండే నిరుద్యోగులకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండగా పట్టించు కోవడం లేదన్నారు. ఇక్కడ భూములు తీసుకుని పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్న యాజమాన్యాలు స్థానిక యువతను కాదని ఉత్తరాది రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకువచ్చి పని చేయించుకుంటూ వీరిని నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలిపారు. భూములు కోల్పోయి, కాలుష్యం బారిన పడి ఆరోగ్యాలు దెబ్బతింటున్న స్థానిక

మిగతా 8లో



## బీసీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది

(మొదటిపేజీ తరువాయి)

రూపొందించడం జరుగుతున్నదన్నారు. జిల్లాలో బిసి వర్గాల వారి భూ సమస్యలు, పట్టాలకు సంబంధించి ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని, 7 మండలాలలో బీసీలకు సంతృప్తి స్థాయిలో పట్టాల మంజూరు కార్యక్రమం చేస్తామని,బిసి కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈడీ బీసీ కార్పొరేషన్ శ్రీదేవి, ఇన్చార్జ్ బీసీ సంక్షేమ శాఖ అధికారి మునీంద్రయ్య,ఎం హెచ్ఓ లోకేష్, నాయకులు షణ్ముగం, అట్లూరి శ్రీనివాసులు,బీసీ నాయకులు పాల్గొన్నారు.

## గొర్రెల సంత వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు

**గూడూరు, మేజర్‌న్యూస్:** ట్రాఫిక్ నియంత్రించాల్సిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి శుక్రవారం 16వ నంబరు జాతీయ రహదారి పక్కనే ఉన్న మార్కెటింగ్ గోడౌన్ వద్ద జీవాల సంత నిర్వహిస్తుంటారు. ఇక్కడ సంతకు ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వాహనాల్లో జీవాలను తీసుకు వచ్చి క్రయ విక్రయాలు చేసుకుని వెళుతుంటారు. దీనికతోడు వరగలి కూడలి వద్దజాతీయ రహదారిపై వంతెన నిర్మాణం జరుగుతుండడంతో అసలే అవస్థలు పడుతుంటే ఇది మరింతగా పెంచుతున్నట్లు వాపోతున్నారు. అయితే ఈ సంత పోలీసులకు కల్పతరువుగా మారడం తప్ప ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు ఇక్కట్లు పట్టవన్న విమర్శలు వస్తుంటాయి. పోలీసులు అక్కడే ఉన్నా తమ పని తాము చూసుకుంటారు తప్ప ట్రాఫిక్ సరి చేయాలన్న ఆలోచన కూడ చేయరని విమర్శలు చేస్తున్నారు. ఉదయం సమయం కావడంతో పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, కార్యాలయాలకు వెళ్లే వాళ్లు ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా పోలీసులు ప్రతి శుక్రవారం స్వకార్యంతో పాటు స్వామి కార్యం(విధులు) చేస్తే బావుంటుందని వాహనదారులు పేర్కొంటున్నారు.



## ఆటో డ్రైవర్లు మర్యాదపూర్వక ప్రవర్తన కలిగిఉండాలి

**గూడూరు, మేజర్‌న్యూస్:** గూడూరు రైల్వే స్టేషన్‌లో ఆటో డ్రైవర్‌లు, గంజాయి, ఇతర నిషేధిత వస్తువుల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆర్‌పిఎఫ్ ఎఎస్ఐ ప్రభాకర్ హెచ్చరించారు. రైల్వే స్టేషన్ ఆవరణంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు బాధ్యతగా మర్యాదపూర్వక ప్రవర్తనను, కలిగి ఉండాలని రైళ్లలో అక్రమంగా సరుకు రవాణా చేయడం, ప్రయాణికుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. రైల్వే నిబంధనలకు భద్రత, సమ్మతిని నిర్ధారించడానికి ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలను సంబంధిత అధికారులకు నివేదించాలని కోరారు. ప్రయాణీకులతో వ్యవహరించేటప్పుడు వృత్తిపరమైన, గౌరవప్రదమైన ప్రవర్తన యొక్క ఆవశ్యకతపై దృష్టి సారించాలని, ముఖ్యంగా రైల్వే స్టేషన్ నుండి బస్టాండ్ లేదా ఇతర సమీప ప్రాంతాలకు రవాణా కోరుకునే వారితో ఆటో డ్రైవర్లు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రయాణీకులు, ముఖ్యంజబగా పర్యాటకులకు, వృద్ధులకు మరియు ప్రాంతం గురించి తెలియని వారికి మెరుగైన సేవలను అందించడంపై దృష్టి సారించాలని, పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.పి.ఎఫ్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొనడం జరిగింది.



## అగ్నిప్రమాదంలో రూ.20వేలు ఆస్తి నష్టం

**చౌడేపల్లిరూరల్, మేజర్‌న్యూస్:** మండలంలోని కాగతి పంచాయతీ జంగాలపల్లిలో శుక్రవారం సంబంతధించిన అగ్నిప్రమాదంలో చింతచెట్లు కాలిపోయి రూ.20వేలు ఆస్తి నష్టం సంభవించి న సంఘటన శుక్రవారం చౌడేపల్లిలో చోటుచేసుకుంది. పుంగనూరు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు కథనం మేరకు జంగాలపల్లికి చెందిన సతీష్ కుమార్ మామిడి తోట, సపోటా, చింతచెట్టుకు వేసిన కంచెకు అగ్ని ప్రమాదం గురైంది. సమాచారం అందు కున్న పుంగనూరు అగ్నిమాపక సిబ్బంది తరలివచ్చి మంటలను అదుపు చేశా రు. ఈ ప్రమాదంలో 10 చింత చెట్లు, పలు మామిడి చెట్లు కాలిపోయాయి. దీంతో రూ.20 వేలు ఆస్తి నష్టం సంభవించిందన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ధూమపానం సేవించి బీడీ ముక్కలు పడేయడం వల్లనే ప్రమాదం సంభవించిందని సుబ్బరాజు తెలిపారు.



## 50 శాతం వడ్డీ మినహాయింపు ఈ నెలాఖరు వరకు పెంపు

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి నగరపాలకసంస్థ పరిధిలో ఇంటిపన్నులు, ఖాళీ జాగా పన్నులను చెల్లిస్తే 50 శాతం వడ్డీ మినహాయింపు ఈ నెలాఖరు వరకు పొడిగించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-2025 సంవత్సరంలో పెండింగ్ ఉన్న బకాయిలు ఏప్రిల్ 30వ తేదీ లోపు ఒకేసారి చెల్లిస్తే ప్రస్తుతమున్న వడ్డీపై 50 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. కావున ఈ అవకాశాన్ని బకాయిదారులు వినియోగించుకొని బకాయిలు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలన్నారు. సెలవు రోజుల్లో కూడా నగరపాలక సంస్థ నందు కౌంటర్లు పని చేస్తాయన్నారు.

## కూతేగానిపల్లిలో మా దేవాలయాన్ని నిర్మించుకోనివ్వండి

**శాంతిపురం, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని కూతేగానిపల్లిలో సుమారు 70 సంవత్సరాలు క్రితం నిర్మించి శిధిలావస్తలో ఉన్న దేవాలయాన్ని పునర్నిర్మించు కోవడానికి అధికారులు సహకరించాలని గ్రామస్తులు కోరారు. వివరాల మేరకు కూతేగానిపల్లి గ్రామంలో శ్రీరామ దేవాలయాన్ని పూర్వం నిర్మించారు. ఆ దేవాలయం చాలావరకు శిధిలావస్థకు చేరడంతో గ్రామస్తు లందరూ చేరి దేవస్థాన ప్రదేశంలో నూతన ఆలయాన్ని నిర్మించాలని పూనుకున్నారు. ఆర్థిక కారణాలవల్ల గత కొన్ని సంవత్సరాలుగా ఆలయ నిర్మాణ పనులు నిలిచాయి, మరల గ్రామస్తులందరూ చేరి చందాలు వేసుకుని ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆలయ నిర్మాణ కార్యక్రమంలో గ్రామస్తులు గతంలో నాయకులు కొందరు 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ డాక్టర్ సురేష్ బాబు పలువురు నాయకులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. 70 శాతం వరకు ముగిసిన దేవాలయ నిర్మాణ పనులను ఒక కుటుంబం వారు దేవాలయ నిర్మాణం చేస్తున్న స్థలం మాకు చెందుతుందని కోర్టులో దావా వేసి పనులు ఆపడం సబబు కాదని వారు తెలిపిన ప్రదేశం కూతేగానిపల్లి గ్రామం చెందిన వారిధని కోర్టు నందు దావా వేసిన వారిది కాదన్నారు. కూతేగానిపల్లి 60-4 గ్రామకంఠం చెందినది అన్నారు. ఈ విషయంపై అధికారులు స్పందించి ఆలయ పునర్నిర్మాణం కోసం సహకరించాలని గ్రామస్తులు కోరారు.



## తెప్పపై శ్రీరామచంద్రమూర్తి అభయం

**తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్:** తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి తెప్పోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం స్వామివారు ఏడుచుట్లు తిరిగి భక్తులకు అభయమిచ్చారు .ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాల సేవ, సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం 9 నుండి 10 గంటల వరకు శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరి నీళ్లతో విశేషంగా అభిషేకం చేశారు. ఉదయం 10 నుండి 11 గంటల వరకు ఉత్సవర్లకు సేవాకాలం, శాత్తుమొర, ఆస్థానం నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు సీతారామలక్ష్మణులు ఆలయం నుండి ఊరేగింపుగా శ్రీరామచంద్ర పుష్కరిణికి చేరుకున్నారు. విద్యుద్దీపాలతో అందంగా అలంకరించిన తెప్పపై సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామివారు ఆశీనులై పుష్కరిణిలో 7 చుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ సురేష్, ఆలయ అర్చకులు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఏపీపీఎస్సీ, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** ఈనెల ఏప్రిల్ 12, 13న జిల్లాలో జరగనున్న ఏపీపీఎస్సీ కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ సంబంధించిన పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు పేర్కొన్నారు.శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు సంబంధిత అధికారులతో రేపు జరగనున్న పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ ఈ నెల 12 మరియు 13 వ తేదిలలో ఒక సెంటర్‌లో నిర్వహించనున్న పరీక్షలు ఉ. 9.30 నుండి ఉ 10.30, మ. 1.00 నుండి మ 02.00 మరియు సా. 4.30 నుండి మ. 5.30 వరకు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి అయ్యాయని పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. తిరుపతి జిల్లాలో ఈ పరీక్షలకు ఒక సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందనీ 600 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ పరీక్షల కొరకు ఒక డిప్యూటీ తాసిల్దార్ ను లైజన్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. పరీక్షా కేంద్రాలలోకి మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాచ్ లు, వైర్లెస్ హెడ్ సెట్స్, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి ఉండదని , పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు, ఆర్టీసి బస్సు సౌకర్యం,విద్యుత్ అంతరాయం లేకుండా సంబందిత శాఖల అధికారులు చూడాలని, త్రాగు నీరు, టాయిలెట్స్ సక్రమంగా ఉండాలని, అభ్యర్థుల సౌకర్యార్థం సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్‌టిసి వారు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రముల వివరాలు: 1004 శ్రీ వెంకటేశ పెరుమాళ్ కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కార్వేటి నగరం రోడ్, చిన్నరాజ కుప్పం, పుత్తూరు, తిరుపతి జిల్లా.ఈ సమావేశంలో కె.శ్రీనివాస రావు, సెక్షన్ ఆఫీసర్, ఎం.రామాజీ, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.




## ఇరిగేషన్ ఈఈ శివారెడ్డికి సన్మానం

**తొట్టంబేడు, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నూతనంగా విచ్చేసిన శివారెడ్డిని తెలుగుదేశం పార్టీ తొట్టంబేడు నేత గాలి మురళి నాయుడు మర్యాద పూర్వకంగా కలసి దృశ్యాలు వాతో సన్మానించి తీర్థప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా మురళీ నాయుడు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలు ముందు పనిచేసిన నీరు, చెట్టు బిల్లులు ఇప్పటివరకు చెల్లించలేదని, గత ఐదు సంవత్సరాలు ముందు గ్రామాలలో కాంట్రాక్టర్లు కాకుండా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, దివంగత నేత స్వర్గీయ బొజ్జల గోపాల కృష్ణారెడ్డి గ్రామలలో చెరువులు, తూములు, పంట కాలువలు వరవ కాలువల పనులను రైతులకు ఇవ్వడం జరిగింది. దానితో రైతులు పనులు చేపట్టి పూర్తి అయిన తరువాత గవర్నమెంట్ మారడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని వీలైనంత త్వరితగతిన జీఎస్టీని తొలగించి బిల్లులను రైతులకు చెల్లించాలని శివారెడ్డిని కోరడం జరిగింది. ఆయన స్పందిస్తూ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షులు ప్రకాష్ నాయుడు, డిఈ ఆదినారాయణ నాయుడు, టెక్నికల్ ఆఫీసర్ వేణు తదితరులు పాల్గొన్నారు.



# బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబా పూలే

### చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతి బా పూలే జయంతిని శుక్రవారం ఉదయం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, తెదేపా నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

# మహా కుంభాభిషేకంలో పాల్గొన్న చిత్తూరు ఎమ్మెల్యే

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** తమిళనాడు రాష్ట్రం షోలింగర్ వద్ద దేవళంపురం



గ్రామంలోని శ్రీకృష్ణుడి ఆలయ మహాకుంభాభిషేకం, కల్యాణోత్సవం కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. పూలమాల, శాలువాతో సత్కరించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

# పెండింగ్‌లో ఉన్న సర్వేలను త్వరగా పూర్తి చేయాలి

**తడ, మేజర్‌న్యూస్:** మండలంలో జరుగుచున్న అన్ని సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలని శు



క్రవారం మండల పంచాయతీ కార్యదర్శుల తో మండల కార్యాలయం ముందు ఎంపీడీఓ ఎన్ విజయకుమార్ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో కార్యదర్శిలతో మాట్లాడుతూ మండలంలో ప్రధానంగా పిజిఆర్ఎస్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ సర్వేను వెంటనే పూర్తి చేయాలని అన్నీ పంచాయతీ కార్యదర్శులును కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శిలు కళా గాబ్రెల్, మస్తానయ్య తదితరులు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

**గూడూరు, మేజర్‌న్యూస్:** గూడూరు పట్టణం బనికేసాహేబ్ పేట లో ఘోర రోడ్డు ప్రమాదం




చోటు చేసుకుంది. శుక్రవారం మద్యాహ్నం లారీ ఢీ కొనడంతో మహిళ రెండుకాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. సమాచారం అందుకున్న గూడూరు వన్ టవున్ ఎస్సై తిరుపతయ్య సంఘటన స్థాలనికి చేరుకుని మహిళను ఆసుపత్రికి తరలించారు. మహిళను ప్రధమ చికిత్స అనంతరం మేరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

# ఘనంగా సీతారాముల కల్యాణం



**చిల్లకూరు, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని తిక్క వరం గ్రామంలో రామాలయంలో సీతారాముల కళ్యాణం వైభవోపేతంగా జరిగింది. గురువారం రాత్రి జరిగిన కళ్యాణంలో నిర్వాహకులు శాస్త్రోక్తం గా సీతారాముల కళ్యాణం నిర్వహించడం విశేషః. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. కళ్యాణంలో పాల్గొన్న భక్తుల కు నిర్వాహకులు తీర్ధ ప్రసాదాలు అందచేశారు.

# ప్రత్యేక అవసర విద్యార్ధులకు గది నిర్మాణం

**చిల్లకూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని పాలిచర్లవారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



లో ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రత్యేక గదిని శ్రీనివాసులు నాయుడు ప్రారంభించారు. సిడబ్ల్యూ ఎస్ఎన్ పాఠశాలను రాజనేని రామా నాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధినేత రాజనేని శ్రీనివాసులు నాయుడు దాతృత్వంతో 85వేల రూపాయల ఖర్చుతో పాఠశాల గదిని ఆధునీకరణ చేయించి శుక్రవారం ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. పాఠశాలకు విచ్చేసిన దాత శ్రీనివాసులు నాయుడుకి విద్యార్థులు పూలతో ఘన స్వాగతం పలికారు. ట్రస్ట్ అధినేత శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ పేదలకు విద్యా, వైద్యం అందించేందుకే రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సేవ చేసే భాగ్యం కలిగినందుకు సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులందరూ చక్కగా చదువుకుని, ఉన్నత స్థాయికి చేరాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మహమ్మద్ రావూఫ్, ట్రస్ట్ కార్యదర్శి రామయ్య నాయుడు, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, రామచంద్రరెడ్డి, ప్రజేంద్రరెడ్డి, మాధవయ్య, సురేంద్ర, బాబు, భాస్కర్, మంజుశ్రీ పాల్గొన్నారు.

# ఏపీఎస్పీడీసీఎల్‌లో ఘనంగా సీతారాముల కల్యాణం



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఎస్పిడిఎల్) కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవం ఉదయం పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా జరిగిన సీతారాముల వివాహ వేడుక సందర్భంగా ఎపిఎస్పీడీసీఎల్ కార్యాలయం ఆధ్యాత్మికతతో నిండిపోయింది.సంస్థ ఉద్యోగులు సంప్రదాయ దుస్తులను ధరించి తమ కుటుంబ సభ్యులతో పాల్గొని శ్రీ సీతారాముల వారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష రావు, డైరెక్టర్లు (ఎఫ్ఎపి) వై.లక్ష్మీ నరసయ్య, పి.అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి,పి.హెచ్. జానకి రామ్, ఆర్.పద్మ, ఎన్.శోభా వాలెంటీనా, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె.జనార్ధన్ నాయుడు, జనరల్ మేనేజర్లు ప్రసాద్, వెంకటరాజు, కృష్ణా రెడ్డి, మురళి, రామచంద్ర రావు,సురేంద్ర రావు, శ్రీకాంత్, నరేంద్రనాధ్, మురళీ కుమార్, ఎస్ఇ/సివిల్ (ఇన్చార్జ్) తిరుమల రావు, సూపరింటెండింగ్ ఇంజనీర్ విజయన్,ఇతర అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# సెంట్రలైజ్డ్ ఆర్ఓ సిస్టమ్ ప్రారంభం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శుక్రవారం స్థానిక ఎపిఎస్ పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సెంట్రలైజ్డ్ ఆర్ ఓ సిస్టమ్‌ను ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష రావు ప్రారంభిం చారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ఉద్యోగులకు, సందర్శకు లకు తాగునీటిని అందించేందుకు వీలుగా సుమారు రూ.10 లక్షల వ్యయంతో సెంట్రలైజ్డ్ ఆర్ఓ సిస్టమ్, భవనంలోని ప్రతి అంతస్తు లోనూ వాటర్ డిస్పెన్సర్లను ఏర్పాటు చేశారు.

**జ్యోతిరావ్ పూలే ఆశయ సాధనకు కృషి...** నేటి సమాజంలోని ప్రతి ఒక్కరూ మహాత్మా జ్యోతిరావ్ గోవిందరావ్ పూలే ఆశయాల సాధనకు కృషి చేయాలని ఏపీ ఎస్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష రావు కోరారు. ఎపిఎస్ పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. సిఎండి కె.సంతోష రావు మాట్లాడుతూ సమాజంలో అసమానతల నిర్మూలనకు పూలే కృషి చేశారన్నారు. భారతదేశంలో ప్రముఖ సంఘసంస్కర్తలలో ఒకరిగా ఆయన గుర్తిం పు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎస్పిడిసిఎల్ డైరెక్టర్లు (ఎఫ్ఎపి) వై.లక్ష్మీ నరసయ్య, పి.అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనే జర్లు జె.రమణాదేవి, పి.హెచ్. జానకిరామ్, ఆర్.పద్మ, ఎన్.శోభా వాలెంటీనా,చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె.జనార్ధన్ నాయుడు, జనరల్ మేనేజర్లు ప్రసాద్, వెంకట రాజు, కృష్ణారెడ్డి, మురళి, రామచంద్ర రావు, సురేంద్రరావు, శ్రీకాంత్, నరేంద్రనాథ్, ఎస్ఇ/సివిల్ (ఇన్చార్జ్) తిరుమలరావు, బిసి ఎంప్లాయిస్ అసోసియేన్ నాయకులు చలపతి పాల్గొన్నారు.

### ఉర్దూ స్కూల్ విలీనం ఆపాలని

# ఎమ్మెల్యేకి వినతి

**గూడూరు మేజర్‌న్యూస్:** పట్టణంలోని చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉన్న ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఇతర పాఠశాలలో విలీనాన్ని నిలుపుదల చేయించాలని ఎమ్మెల్యేకి వినతి చేశారు. మైనారిటీ నాయకులు మాట్లాడుతూ 75 ఏళ్లకు పైగా ఉర్దూ స్కూల్‌కు చరిత్ర ఉందన్నారు. దీంతో ముస్లిం విద్యార్థులు ఉర్దూ భాషకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఉర్దూ స్కూల్స్ విలీనాన్ని నిలిపివేయాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ ఉర్దూ భాష కొనసాగేలా సంబంధిత అధికారులతో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మైనారిటీలు షఫీ మౌలానా, ఎండీ. అబ్దుల్ రహీం, నాజర్ భాయ్, అలీ హుస్సేన్ భాయ్, అబ్రార్, జమాలుల్లా, షబ్బీర్, గౌస్ బాష, ఛోటు, ఇబ్రహీం, అబూబకర్, ఇలియాజ్, వసీం, దర్బార్ ఇబ్రహీం, అబూబకర్, ముజాహిద్ ఇస్లాం, ఖాదర్ బాష, రషీద్, షంషుద్దీన్, ముజీబ్, జన్నత్, ఇనాం, డాక్టర్ రిజ్వాన్, వసీం, మున్నా, హాషిం పాల్గొన్నారు.



# అనిల్ రావిపూడి, రోజా న్యాయనిర్ణేతలుగా డ్రామా జూనియర్స్ సీజన్-8

**తిరుపతి, మేజర్‌న్యూస్:** తెలుగు ప్రేక్షకులకు ఎప్పటికప్పుడు సరికొత్త కార్యక్రమాలని అందిస్తూ వినోదం పంచుతున్న ఛానల్ జీ తెలుగు. చిన్నారుల్లోని ప్రతిభను వెలికితీస్తూ ప్రేక్షకాదరణతో విజయవంతంగా 7 సీజన్లు పూర్తి చేసుకున్న జీ తెలుగు డ్రామా జూనియర్స్ కొత్త సీజన్ 8 ఏప్రిల్ 12న, ప్రారంభం కానుంది. ప్రతి శనివారం రాత్రి 9 గంటలకు, మీ జీతెలుగులో సంవత్సరాల నుంచి ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న డ్రామా జూనియర్స్ 8వ సీజన్‌తో మరోసారి ప్రేక్షకులకు వినోదం పంచేందుకు సిద్ధమైంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పిల్లల్లో దాగున్న నటనా ప్రతిభను వెలికి తీసే ఉద్దేశ్యంతో కొత్త సీజన్ని ప్రారంభిస్తోంది. ఈ షోను ఎవర్గ్రీన్ ఎనర్జిటిక్ యాంకర్ సుధీర్ హోస్ట్ చేయనున్నారు. ప్రతిభ గల చిన్నారులను మరింత ప్రోత్సహించి వారిని ఆశీర్వదించేందుకు ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి, నటి రోజా న్యాయనిర్ణేతలుగా వ్యవహరించనున్నారు.ఇక, డ్రామా జూనియర్స్ సీజన్-8 గ్రాండ్ లాంచ్ ఎపిసోడ్ ముఖ్య అతిథులుగా ప్రముఖ నటులు జగపతి బాబు, ఆమని హాజరై చిన్నారుల్లో మరింత ఉత్సాహం నింపనున్నారు. వీళ్ళ నటనా ప్రతిభ కనబరిచే అద్భుతమైన ప్రదర్శనలు, సరదా సంభాషణలతో డ్రామా జూనియర్స్ సీజన్ 8 ఘనంగా ప్రారంభం కానుంది.ఇక, ఈ సీజన్లో పాల్గొనే చిన్నారులు రెండు జట్లు బాయ్స్ టీమ్, గర్ల్స్ టీమ్‌గా తలపడనున్నారు. గర్ల్స్ టీమ్‌కి యాంకర్ లాస్య, బాయ్స్ టీంకి త్రినయని సీరియల్‌తో జీ తెలుగు ప్రేక్షకులను అలరించిన నయని మెంటర్లుగా వ్యవహరిస్తున్నారు. మెంటర్ల సారథ్యంలో అలరించే స్కిట్స్‌తో అంతులేని వినోదం పంచే ఈ కార్యక్రమాన్ని జీ తెలుగు వేదికగా ప్రతి శనివారం మీరూ తప్పకుండా చూడండి.



# తిరుపతి- కాట్పాడి రైల్వే లైన్ డబ్లింగ్‌కు కేంద్ర మంత్రివర్గ ఆమోదం హర్షనీయం

**- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు కృషి ఎనలేనిది**
**- ఎన్డీఏ సర్కార్కు కృతజ్ఞతలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే మనోహర్**

**చిత్తూరు బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి -కాట్పాడి రైల్వే లైన్ డబ్బింగ్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం హర్షినీయమన్నారు మాజీ ఎమ్మెల్యే ఏ.ఎస్. మనోహర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక పాత్రికేయులతో మాట్లాడుతూ మనకు రైల్వే మార్గం రావడానికి ప్రధాన కారణమైన చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు కృషి ఎనలేనిది అని రాయలసీమ ప్రగతికి తోడ్పాటునందిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. తిరుపతి-కాట్పాడి వయా చిత్తూరు.. రైల్వే డబుల్ లైన్ ఏర్పాటుకు కేంద్రం 1332 కోట్లు మంజూరు చేయడంతో పాటు 104 కి.మీల డబుల్ లైన్ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేయడం.. కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవ, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు కర్తవ్యా నిర్వహణచిత్తూరు అభివృద్ధికి కీలక అడుగు కాబోతోందని చెప్పిన మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్.గతంలో చిత్తూరు రైల్వే స్టేషన్లో ఆగని ఎక్స్ప్రెస్ రైళ్ళు జిల్లా కేంద్రమైన చిత్తూరు రైల్వేస్టేషన్లో ఆగనున్నాయని తెలిపారు. తద్వారా పుణ్యక్షేత్రాలకు నిలయమైన



తిరుపతి, తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీకాళహస్తి ఆలయం, కాణిపాకం, గోల్డ్ అండ్ టెంపుల్ వంటి ఆలయాలను సందర్శించాలనుకునే భక్తులకు, కేంద్ర రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయం సౌలభ్యంగా మారనుందని చెప్పారు. అంతేకాకుండా వాణిజ్యపరంగా చిత్తూరు జిల్లా అభివృద్ధికి బాటలు వేసినట్లు అయ్యిందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ఇచ్చిన హామీ మేరకు, తిరుపతి -కాట్పాడి రైల్వే లైన్ డబ్బింగ్ విషయాన్ని లోక్ సభలో వినిపించడంతో పాటు, కేంద్ర రైల్వే శాఖ మంత్రికి లిఖితపూర్వకంగా వినతులు సమర్పించడం ద్వారానే ఇది సాధ్యమైందని, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు కృషిని అభినందించారు. అంతేకాకుండా రానున్న రోజుల్లో చిత్తూరు పార్లమెంటు పరిధిలో ఎంపీ నిధుల నుండి అనగా అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టడం జరిగిందని ఆ మేరకు ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఐదు సంవత్సరాలు చిత్తూరు పార్లమెంటుకు పేరుకు మాత్రమే ప్రజాప్రతినిధిగా ఉన్న వ్యక్తి చెప్పుకోదగిన ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి కొద్ది నెలలైనా కొండంత అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా చేపడుతూ ప్రజల మన్ననలు పొందడం హర్షణీయమని అన్నారు.



# ఏకాంబర కుప్పం రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రతిపాదనలు సిద్ధం చేసి పూర్తి చేయండి

**- ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్**

**నగరి, మేజర్‌న్యూస్:** ఏకాంబర కుప్పం రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రతిపాదనలు సిద్ధం చేసి పూర్తి చేయండి- రైల్వే, ఆర్ అండ్ బి అధికారులకు ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదేశించారు. నియోజకవర్గంలో రైల్వే క్రాస్‌లు ఉన్న నగరి మున్సిపాలిటీ ఏకాంబరకుప్పం రైల్వే లెవెల్ క్రాస్ (49) వద్ద ఓవర్ బ్రిడ్జి, పుత్తూరు రైల్వే లెవెల్ క్రాస్ (55) మరాఠి గేట్ వద్ద అండర్ బ్రిడ్జి, పుత్తూరు ఆర్ డి ఎం రైల్వే క్రాస్ (56) వద్ద ఓవర్ బ్రిడ్జి, వడమాలపేట మండలం పూడి క్రాస్ (67) వద్ద ఓవర్ బ్రిడ్జి ప్రతి పాదనలు సిద్ధం చేసి, పనులు మంజూరు అయి పూర్తి అయ్యేట్లు చూడాలని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆర్ అండ్ బి, రైల్వే, కన్సల్టెన్సీ లను ఆదేశించారు. శుక్రవారం ఎమ్మెల్యే స్వగృహంలో అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేసారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సహకారం తో రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జి నిర్మించి ప్రజల కష్టాలు తీరుస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఓవర్ బ్రిడ్జి నిర్మించే ప్రాంతంలో లైట్ వెహికల్ కోసం సబ్ వే లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమీక్షలో చిత్తూరు ఆర్ అండ్ బి ఈఈ -శ్రీనివాసులు, తిరుపతి ఆర్ అండ్ బి ఈఈ -మధుసూదన్ పుత్తూరు డి ఈ -అమరనాథ్‌లు పాల్గొన్నారు.

# శ్రీ శక్తి పీఠంలో శ్రీ లక్ష్మి కుబేర సహిత స్వర్ణాకర్షణ భైరవ మంత్ర హెూమం



**రామచంద్రపురం, మేజర్ న్యూస్:** రామచంద్రాపురం మండలంలోని రాయల చెరువు కట్ట సమీపంలో వెలసియున్న శ్రీ శక్తి పీఠం 5వ బ్రహ్మోత్సవ కుంభాభిషేకములలో భాగముగా రెండవ రోజు కుర్తాళం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి దివ్య సమక్షంలో మంత్ర మహేశ్వరి శ్రీ శక్తి పీఠాదీశ్వరి మాతజీ శ్రీ శ్రీ శ్రీ రమ్యానందభారతీ స్వామిని వారి ఆధ్వర్యంలో ఈరోజు శ్రీ లక్ష్మీ కుబేర సహిత స్వర్ణాకర్షణ భైరవ మంత్ర హెూమము నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తులచే పూర్తిగా ఉచితంగా శ్రీ వారాహీ, ప్రత్యంగిరా సహిత శక్తికాళీ మంత్ర హెూమము హెూమము పూర్తిగా ఉచితంగా చేయించడం జరిగినది. ఈ కార్యక్రమంలో సుమారు 2000 మంది పాల్గొన్నారు. భక్తులకు అందరికీ అన్న ప్రసాద వితరణ చేయడము జరిగినది అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ శక్తి పీఠం ఆలయ వ్యవస్థాపకులు ఆలయ అర్చకులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నేడు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ కార్యాలయాలు ఉదయం 11 నుండి సాయంత్రం 5.30 గం.ల వరకు పనిచేస్తాయి

**-జిల్లా రిజిస్ట్రార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రెండవ శనివారం ఏప్రిల్ 12న కూడా ఉదయం 11 నుండి సాయంత్రం ఐదున్నర గంటల వరకు రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ కార్యాలయాలు అన్ని పనిచేయాలని ఆదేశించిన నేపథ్యంలో, తిరుపతి జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5:30 గం.ల వరకు ఈ రెండవ శనివారం ఏప్రిల్ 12న పనిచేస్తాయని జిల్లా రిజిస్ట్రార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ శ్రీరామ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు శాఖకు సంబంధించి రిజిస్ట్రేషన్ తో సహా అన్ని సేవలు పొందవచ్చును.

# శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం భూములు కబ్జాలపై సూర్య కథనానికి స్పందన

**- కబ్జాదారులపై ప్రత్యేక రెవెన్యూ టీం**
**ల్యాండ్ గ్లాబ్లింగ్ కేసులు : ఈఓ టి బాపిరెడ్డి**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం స్వర్ణముఖి నది గొడ్డేరు భూములు ఆక్రమణలపై శ్రీకాళహస్తి పట్టణం బడా నేతలు పేర్లు వినిపిస్తున్నాయి. చుక్కలు నిడిగల్లు. గొడ్డేరులలో సుమారు 30 ఎకరాలు శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం భూములు అన్యా క్రాంతం కాబడినాయి. శ్రీకాళహస్తి పట్టణం వ్యాపారవేతలు. రాజకీయ నాయకులు. ప్రజా ప్రతినిధులు హస్తం ఉన్నట్లు తెలుస్తున్నది. స్వర్ణముఖి నది గొడ్డేరు కాలవ కబ్జాదారులపై తొందర్లో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని దేవస్థానం ఈవో టి బాపిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానం రికార్డులు ప్రకారం సెంటు భూమి కూడా వదలమని తెలిపారు.



ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి. జిల్లా కలెక్టర్ తో సంప్రదించి దేవస్థానంనకు ప్రత్యేక రెవెన్యూ టీం నియ మిస్తున్నామని తెలిపారు. సర్వే నెంబర్ 186/1291.306.337. 329.325.252.1.2. లలో తొందరలో కబ్జాదారులపై ల్యాండ్ గాబ్లింగ్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. స్వర్ణముఖి నదిలో కట్టపై 30 అడుగులు రోడ్డు నిర్మించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొంతమంది స్వర్ణముఖి నది గొడ్డేరు భూములు రికార్డులు తారుమారు చేసి కబ్జా చేయడం జరిగింది. వారు కావాలనే దేవస్థానంపై కోర్టులకు పోవడం జరిగింది. వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# శ్రీవారిని దర్శించుకున్న ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు

**తిరుమల, మేజర్‌న్యూస్:** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం శ్రీవారి అభిషేక సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు మీడియాతో మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. నా కుమారుడి జన్మదినం కావడంతో శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నామని అన్నారు. ఒంటిమిట్టలో వైభవంగా ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. భక్తులు అందరు సుఖసంతోషాలతో ఉండాలని ఆ దేవదేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు.



# బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావ్ పూలే : మేయర్

**చిత్తూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే అని మేయర్ ఎస్ అముద చెప్పారు. జ్యోతిబా పూలే జయంతి పురస్కరించుకొని చిత్తూరు నగరపాలక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సమ సమాజ స్థాపనకు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే నిరంతరం కృషి చేశారని, ఆయన సేవలను నేటితరం స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, ఎంహెచ్వో డా. పి లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి, సీఎంఎం వెంకటరమణ, ఆర్వో ఉమామహేశ్వర్ రెడ్డి, టీపీవో సుభప్రధ, డీఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఏఈలు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# ఆధునిక యుగ తథాగతుడు మహాత్మ జ్యోతిరావు పూలే

**- జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేత షణ్ముగం**
**- రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి హేమావతి**

**చిత్తూర్ బ్యూరో, మేజర్‌న్యూస్:** ఆధునిక యుగ తథాగతుడు బీసీల ఆరాధ్య దైవం మహాత్మ జ్యోతిరావు పూలే అని బీసీ సంక్షేమ సంఘ దక్షిణాది రాష్ట్రాల ఇన్చార్జ్ షణ్ముగం, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి హేమావతిలు శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే నూట తొంబై తొమ్మిదవ జయంతి సందర్భంగా నగరంలోని స్థానిక బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలను వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'ప్రాచీన యుగంలో బుద్ధుడు, ఆదునిక యుగంలో మహాత్మా జ్యోతిరావు పూలే నాకు గురువులు' అని భారత రాజ్యంగా నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ అన్నారు అన్న విషయం గుర్తు చేశారు. అలాగే దళిత, గిరిజన, బలిహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేయడం ద్వారా 'రాజ్యాధికార సాధనకి' కృషి చెయ్యాలని పూలే సూచించారు. ఆ సూచనను డా. అంబేద్కర్ మనస్ఫూర్తి గా అంగీకరించారు కనుకనే నవీన యుగంలో పూలే నాకు గురువని ఆయన అన్నారు.



# గోవుల మరణాలను రాజకీయం చేసే వ్యక్తి కరుణాకర్‌రెడ్డి

## మూగ జీవాలను రాజకీయం చేయడం తగదు

**- మతిభ్రమించి మాట్లాడుతున్న కరుణాకర్ రెడ్డి...**
**- బహిరంగ చర్చకు సిద్ధమా...?**
**- టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం**



**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్ :** టీటీడీ గోశాలలోని మూగజీవాలను కూడా వైసిపి నాయకులు రాజకీయం చేయడం తగదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం చెప్పారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన ఎస్ వి గోసంరక్షణ శాలలో గత మూడు నెలలుగా 100 ఆవులు చనిపోయాయి అని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చెప్పడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కరుణాకర్ రెడ్డి కి నైతిక విలువలు ఏమాత్రం లేవని, ప్రజలు మీ కుటుంబాన్ని తిరస్కరించిన మళ్లీ ఏ ముఖం పెట్టుకొని మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. రిలయన్స్ సంస్థ కోటి 35 లక్షల రూపాయలు నిధులను ఇచ్చారని ఆ డబ్బులతో 30 నుంచి 40 ఆవులు కొనుగోలు చేశారన్నారు. వాటిని తీసుకువచ్చే క్రమంలో కొన్ని అనారోగ్యానికి గురై చనిపోతే మరికొన్ని వయసు పైబడినవి చనిపోతూ ఉంటాయని చెప్పారు. గత నెల 28వ తేదీన ఓ రైలు బండిని ఒక ఆవు ఢీకొని చనిపోయిందని పేర్కొన్నారు. భువన కరుణాకర్ రెడ్డి చెప్పినట్లు వందల ఆవులు చనిపోలేదని ఇది పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. 2022 -23 సంవత్సరాలలో 90 గూగుల్ చనిపోయాయి అని, అప్పుడు ఎందుకు కరుణాకర్ రెడ్డి మాట్లాడలేదని ప్రశ్నించారు. ఎస్ వి గోశాలలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్ వి గోసంరక్షణ అధికారి హరినాథ్ రెడ్డి సస్పెన్షన్కు గురైన టీటీడీకి చెందిన మొబైల్ ఫోను వినియోగిస్తున్నారని వెంటనే ఆయన టీటీడీకి సెల్ ఫోన్ ను సిమ్ ను అప్పగించాలని కోరారు. వైసిపి ప్రభుత్వ హయాంలో 1500 గోవులు మాత్రమే గోశాలలో ఉండేవని, కూటమి ప్రభుత్వం వచ్చాక 200700 పైగా గోవులు సంరక్షణలో ఉన్నాయన్నారు. భూమన కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కరుణాకర్ రెడ్డి నిరూపించలేక పోతే బహిరంగ క్షమాపణ చెప్పాలని, వెంటనే రాజకీయ సన్యాసం ప్రకటించాలని డిమాండ్ డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఎం ఆర్ పల్లి రామచంద్రారెడ్డి, మధుబాబు, నందకుమార్, ఉమాపతి, ఖాజా పాల్గొన్నారు.

## చిత్తూరు జిల్లా టిడిపి నాయకులు



**చిత్తూరు అర్బన్ మేజర్ న్యూస్:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హిందూ ధార్మిక క్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలలో గోవులు మరణిస్తున్నాయని టిటిడి మాజీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని చిత్తూరు జిల్లా టిడిపి నాయకులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ మాట్లాడుతూ సకల దేవత స్వరూపిణి గోవు అని కొలుస్తుంటారు అటువంటి గోవులు వందలాదిగా చనిపోతున్నాయంటూ కరుణాకర్ రెడ్డి ప్రచారం చేయటం అతను స్థాయికి తగదని ఎక్కడో చనిపోయిన గోవుల ఫోటోలు చూపించి రాజకీయం చేయటం దుర్మార్గం, గోశాలలో గోవులకి అన్ని రకాల సౌకర్యాలు కల్పించి, జియో టాకింగ్ కల్పించి ,మందులు, వైద్య చికిత్సలు, నాణ్యమైనటువంటి దాన, అందిస్తూ గోవుల్ని లేగ దూడలను కంటికి రెప్పలాగా కాపాడుతుంటే, కరుణాకర్ రెడ్డి రాజకీయ ప్రయోజనం కోసం గోవులు చనిపోతున్నాయని వాటికి నీళ్లు అందటం లేదని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. తగిన పర్యవేక్షణ లేదని వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేస్తూ మతవిద్వేషాలు రెచ్చగొడుతున్నారని, కరుణాకర్ రెడ్డి చూపించిన ఫోటోలన్నీ తప్పుడు ఫోటోలని, అది తిరుపతి తిరుమల తిరుపతి సంబంధించినటువంటి ఫోటోలు కావని, కరుణాకర్ రెడ్డి చైర్మన్ గా ఉన్నప్పుడు గోశాల కోసం ఆయన ఏమి చేశారని, బహిరంగంగా చెప్పాలిని సూటిగా ప్రశ్నిస్తున్నాం అన్నారు. కరుణాకర్ రెడ్డి ,వైవి సుబ్బారెడ్డి, చైర్మన్ గా ఉన్నప్పుడు, జవహర్ రెడ్డి ఈవో గ్గా ఉన్న ఉన్నన సమయంలో గోశాలకు నాసిరకమైనటువంటి దానా సరఫరా చేసి గోవుల కడుపు కొట్టిన చరిత్ర కరుణాకర్ రెడ్డిది గోవుల మృతి పైన బహిరంగ చర్చకు సిద్ధమేనా అని సూటిగా ప్రశ్నిస్తున్నామన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకీటీల సురేంద్ర కుమార్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ , పూతలపట్టు నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు ధరణి ప్రకాష్ లు పాల్గొన్నారు.

## వైభవంగా శివపార్వతుల కళ్యాణోత్సవం



**నగరి, మేజర్‌న్యూస్:** పట్టణంలో కొలువై వున్న శ్రీ కామాక్షి సమేత కరకంతేశ్వర స్వామి ఆలయం నందు 27 వ సంవత్సర పంగుణోత్తర తిరు కళ్యాణ బ్రహ్మోత్సవం ప్రారంభమైనది, దీనిని పురస్కరించుకొని మధ్యాహ్నం 12: 30 గం" అన్నదానం నిర్వహించారు అనంతరం రాత్రి 8 గంటలకు శివపార్వతులు కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది, పెద్ద ఎత్తున భక్తులు శివపార్వతుల కల్యాణ వైభోగం తిలకించుటకు పోటెత్తారు. భక్తులపాలిటి కొంగు బంగారుమైన ఆ శివపార్వతుల కృపా కటాక్షలు పొందారు. ఆలయ కమిటీ సభ్యులు ఉభయ దారులకు పెళ్లి తలంబ్రాలు, పసుపుదారం, ప్రసాదాలు అందించారు, వచ్చిన భక్తులందరికీ కూడా తలంబ్రాలు, పసుపుదారం, ప్రసాదాలు పంపిణీ చేశారు.

## ఘనంగా కస్తూర్బా గాంధీ జయంతి

**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:** స్థానిక గాంధీ రోడ్డు లోని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ డాక్టర్ పి.సి. రాయులు ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ గారి 156వ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి నగర డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి మబ్బు దేవ నారాయణ రెడ్డి బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు మరియు బిజెపి నాయకులు హాజరైనారు. ఈ సందర్భంగా మొదట అతిథులచే కస్తూర్బా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం అతిధులచే కేక్ కట్ చేసి అనంతరం వేయి మందికి అన్నదానం వస్త్ర దానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పి.సి.రాయులు మాట్లాడుతూ ప్రతి ఏటా క్రమం తప్పకుండా కస్తూర్బా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరుపుతున్నామని, కస్తూర్బా గాంధీ దక్షిణాఫ్రికాలో గాంధీతో కలిసి భారతీయుల హక్కుల కోసం పోరాడిన గొప్ప మహిళ అని 1942లో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నా రని అనేక సామాజిక ఉద్యమాలలో పాల్గొన్నారు ఆమె త్యాగం ధైర్యం సేవ మూర్తిగా చరిత్ర లో నిలిచిపోయారని తెలియజేస్తూ అలాగే ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు ముఖ్యంగా మహిళలకు అనేక కార్యక్రమా లు నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేశారు. నగర డిప్యూటీమేయర్ ఆర్ .సి. మునికృష్ణ మాట్లాడుతూ డాక్టర్ పి .సి .రాయులు నిరంతర సేవా కార్యక్రమాలను కొనియాడుతూ ఈ సందర్భంగా ఈరోజు కస్తూర్బా గాంధీ జయంతి పురస్కరించుకొని పేద మహిళలకు అన్నదానం, వస్త్రధానం చేయడము ఆయన గొప్ప మనసుకు తార్కానమని తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి మబ్బు దేవనారాయణ రెడ్డి మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ యొక్క సేవలను కొనియాడుతూ అలాగే ట్రస్ట్ చైర్మన్ పి. సి. రాయులు యొక్క సేవా కార్యక్రమాలను కొనియాడారు. బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు మాట్లాడుతూ డాక్టర్ పి .సి .రాయులు మన ప్రాంత వ్యక్తి అయినందుకు చాలా గర్వంగా ఉందని గత 20 సంవత్సరాలుగా ట్రస్టు ద్వారా పేద బడుగు బలహీన వర్గాలకు ముఖ్యంగా మహిళలకు నిరంతర సేవా కార్యక్రమాలు చేస్తూ ఈరోజు కస్తూర్బా గాంధీ జయంతి సందర్భంగా వెయ్యి మందికి పేదలకు అన్నదానము వస్త్ర దానము చేయడం చాలా గొప్ప విషయమని ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు నాకు చాలా ఆనందంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, బిజెపి స్థానిక నాయకులు మరియు బండి మధుసూదన్ రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, ఉమాపతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.





## పార్టీ బలోపేతానికి కృషి చేయండి : బీజేపీ జిల్లా అధ్యక్షుడు

**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** రానున్న స్థానిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయడానికి బిజెపి నాయకులు కార్యకర్తలు తమ వంతు కృషి చేయాలని జిల్లా బిజెపి అధ్యక్షుడు జగదీష్ నాయుడు, గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి రాజేంద్రలు సంయుక్తంగా పిలుపునిచ్చారు. శుక్రవారం వెదురుకుప్ప మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు బోడి రెడ్డి అశోక్ రెడ్డి ఆధ్వర్యంలోవెదురుకుప్పం మండలం తిరుమలయ్య పల్లి పంచాయతీలో భారతీయ జనతా పార్టీ మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి అధ్యక్షుడు మాట్లాడుతూ పార్టీ ఆదేశాలు మేరకు స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేసి పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం పార్టీ యొక్క స్థితిగతుల గురించి నాయకులు కార్యకర్తలతో జిల్లా అధ్యక్షుడు గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి రాజేంద్రలు చర్చించారు. కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర కౌన్సిలింగ్ నెంబర్ బోడి రెడ్డి హనుమంత రెడ్డి మండల ఉపాధ్యక్షులు సోమశేఖర్ రాజు కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం రెడ్డి రాజేంద్రరెడ్డి సీనియర్ నాయకులు చెంగారెడ్డి,విజయభాస్కర్ రెడ్డి ఎస్టీ మోక్ష మండల అధ్యక్షులు శేఖర్, యువ మోర్చా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ,ప్రధాన కార్యదర్శి బాలాజి రెడ్డి,సోషల్ మీడియా ఇంచార్జ్ గుణశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, శంకర్ రెడ్డి,మాధవ రెడ్డి, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## టీటీడీ గోశాలలో గోవుల మృతి ఘటనపై ఎంపీ గురుమూర్తి తీవ్ర ఆవేదన

**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:** గత మూడు మాసాలలో టీటీడీ గోశాలలో సుమారు 100 గోవుల మృతి చెందిన విషయంపై తిరుపతి ఎంపీ గురుమూర్తి స్పందించారు. హిందువులు గోవులను తల్లిగా భావించి 'గోమాత' అని పిలుస్తారు. అలాంటి గోవులు ఇలాంటి దయనీయ స్థితిలో ఉండటం ఎంతో క్షోభను కలిగిస్తోందని తీవ్ర ఆవేధన వ్యక్తం చేస్తూ, ఈ చర్యలను ఖండించారు. ఈ ఘటనతో టి.టి.డి గోశాల నిర్వహణ ఎలా ఉందో నిరూపితమైందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడింది మొదలు అస్తవ్యస్త పాలనతో రాష్ట్ర ప్రజలకు మాత్రమే కాకుండా నోరులేని గోవులకు కూడా ఇలాంటి దుస్థితి పట్టిందన్నారు. తక్షణమే గోవుల మరణంపై లోతైన విచారణ జరిపాలని డిమాండ్ చేశారు. గోశాలలోని గోవుల పట్ల నిర్లక్ష్యం ఏమాత్రం సహించరానిదని ఎంపీ స్పష్టం చేశారు.

## శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు

**తిరుమల, మేజర్ న్యూస్:** శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం అభిషేక సేవలో విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనా చౌదరి., తెలంగాణ ఎలక్షన్ కమిషనర్ రాణి, ఆంధ్రప్రదేశ్ ఎలక్షన్ కమిషనర్ నీలం సహని., ఆర్టీసీ ఎండి తిరుమల రావు, బీజేపీ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి లు వేర్వేరుగా స్వామి వారి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదశీర్వచనం అందించగా.. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు.



## ఆర్పీల గౌరవ వేతనం రూ.18 వేలకు పెంచాలి

**- ఎమ్మెల్యేకు ఆర్పీల వినతి**



**పలమనేరు, మేజర్‌న్యూస్:** పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్ల శ్రమను గుర్తించి ప్రభుత్వం సరైన ప్రోత్సాహం ఇవ్వాలని ఆర్పీలు డిమాండ్ చేశారు. ఆ మేరకు ఎమ్మెల్యే కార్యాలయంలో తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని స్థానిక ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డిని శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్పీల కాలపరిమితి రద్దు చేయాలని కోరా రు. ప్రస్తుతం ఇస్తున్న 8 వేల గౌరవ వేతనాన్ని, 18 వేలకు పెంచి ఇవ్వాలన్నారు. ప్రధానంగా మహిళా వికాస్ యాప్ వల్ల సంఘ సభ్యులతో సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ఆ యాప్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సీనియారిటీ కలిగిన ఆర్పిలకు సి ఓ లుగా సిఎల్ఆర్పిలుగా ప్రమోట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఆర్పీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తన వంతు సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు ధనలక్ష్మి, జ్యోత్స్న, షకీలా బేగం, కస్తూరి, లావణ్య, గాయత్రి,జమున, శ్యామల, జరీనా తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత కోసం 15 రోజులు స్పెషల్ డ్రైవ్



**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు వెదురుకుప్పం మండలంలో స్వచ్ఛత గ్రామాలుగా తీర్చిదిద్దే భాగంలో 15 రోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు వెదురుకుప్పం ఎంపీడీవో ఎల్ పురుషోత్తం అన్నారు. మండలంలో శుక్రవారం నల్ల వెంగనపల్లి, అగ్గి చేనుపల్లి పంచాయతీల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ క్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టి స్వచ్ఛత గ్రామాలుగా తీర్చిదిద్దాలని సర్పంచులను, పంచాయతీ కార్యదర్శులను కోరారు. పారిశుద్ధ్య నిర్వహణపై పలు సూచనలు, సలహాలను అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గ్రీన్ అంబాసిడర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## లాఖరులోగా ఆస్తి పన్ను చెల్లిస్తే 5శాతం రాయితీ

**- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు**



**కుప్పం, మేజర్ న్యూస్:** కుప్పం పురపాలక సంఘంకు సంబంధించి 2025 -26 ఆర్థిక సంవత్సరానికి ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు కుప్పం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను మొత్తాన్ని ముందస్తుగా ఏకమొత్తంగా ఏప్రిల్ 30వ తేదీ లోపు చెల్లించిన వారికి 5 శాతం రాయితీ లభిస్తుందన్నారు. ఈ నెలాఖరులోగా ఆస్తి పన్ను చెల్లించి అసలులో ఐదు శాతం రాయితీ పొందాలన్నారు. ఐదు శాతం రాయితీ అవకాశాన్ని కుప్పం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, పనులు చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో బకాయిలు ఉన్నవారు పూర్తిగా చెల్లిస్తే అపరాధ రుసుము 50% వర్తిస్తుందని పేర్కొన్నారు. పన్నులను పుర పాలక కార్యాలయంలోని పురసేవ కౌంటర్ వద్ద, చెల్లించవచ్చని తెలిపారు. అన్ని సెలవు రోజుల్లోనూ పురపాలక కౌంటర్ పనిచేస్తుందని కమిషనర్ తెలిపారు.

## బీసీ సామాజిక వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే

**- మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం**



**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన దీనజన బాంధవుడు, సమసమాజ స్థాపనలో భావితరాలకు నిత్య స్ఫూర్తి ప్రదాతగా మహాత్మ జ్యోతిరావు పూలే అని మాజీ ఎంపీ, టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. మహాత్మ జ్యోతిరావు జయంతి పురస్కరించుకొని నాయుడుపేటలోని టీడీపీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సమాజంలో ఉన్న కుల, మత, ఆర్థిక అసమానాలతను తొలగించడానికి విద్యను ఒక సాధనంగా ఉపయోగించిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, నాయకులు మైలార్ రాజశేఖర్, సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మొండెం బాబు, వినుకొండ ధనంజయ, అవదానం సుధీర్, మహిళా నాయకురాలు సుజాతమ్మ, కన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పోషణ పక్వాడ పోషకాహారం అందజేత



**గుడిపాల, మేజర్ న్యూస్:** గుడిపాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సి డి పి ఓ శ్యామ సుగుణ కుమారి పర్యవేక్షణలో 189 కొత్తపల్లిపోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ శ్యామ్ సుగుణ కుమారి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రం నందు లబ్ధిదారులు మరియు అంగన్వాడి టీచర్లకు పోషకాహారం పై అవగాహన కల్పించారు. ప్రతిరోజు పౌష్టికాహారుని తీసుకోవాలని తద్వారా పిల్లలు తల్లులకు ఇచ్చిన గ్రోత్ కార్డుల ద్వారా బరువు సూచించే విధంగా ఉండాలని ప్రతి నెల పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు తీసుకువచ్చి పిల్లల బరువు మరియు ఎత్తు తనిఖీ చేయించి వారి ఎత్తు బరువు పెరిగేలాగా చూడాలన్నారు. పరిశుభ్రమైన తాగునీరు మరుగుదొడ్ల వినియోగం గురించి అంగన్వాడి సిబ్బందికి అవగాహన కల్పించారు. సిపిడిఓ శ్యామ సుగుణ కుమారి, అంగన్వాడి సూపర్వైజర్ పుష్పవతి. బిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబు. ఈసీ ప్రభు, శివశంకర్,అంగన్వాడి టీచర్లు, రాణి,గౌరీ, నిర్మల, అన్ని అమ్మ, విజయ, కోకిల, మంజుల, గర్భవతులు, చిన్నపిల్లల తల్లులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**రొంపిచెర్ల, మేజర్ న్యూస్:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం బొమ్మయ్య గారి పల్లి గ్రామపంచాయతీలోని పోలీసు స్టేషన్ దగ్గర చెత్త కుప్పల తొలగింపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాలను పరిశుభ్రం గా ఉంచడం జరుగుతుందన్నారు. రోడ్డుపక్కలో, ఇళ్ల మధ్యలో వున్న దిబ్బలు ఎత్తించడం, మురికి నీటి కాలువలను శుభ్రపరచడం జరుగుతుందని అన్నారు. ఈ నెల 24 వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరిబాబు, సచివాలయ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిరావు పూలే ఒక గొప్ప సామాజిక సంస్కర్త

**- పీడిత జన బాంధవులు మహాత్మా జ్యోతిరావు పూలే**
**- బిజెపి సీనియర్ నాయకులు చిట్టి బాబు కొల్లా**



**గుడిపాల, మేజర్‌న్యూస్:** గుడిపాలలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు కోల చిట్టిబాబు పాల్గొన్నారు. సందర్భంగా చిట్టి బాబు మాట్లాడుతూ గుడిపాల మండలం 197 రామాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిజెపి నియర్ నాయకులు చిట్టి బాబు కొల్లా పాల్గొన్నారు. మాట్లాడుతూ భారత ప్రప్రథమ సామాజిక తత్వవేత్త. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, అణచివేతకు గురవుతున్న ప్రజలకు ఆత్మస్థైర్యం అందించేందుకు, వారి హక్కుల కోసం, నిరంతరం అననుకూల పరిస్థితులలో పోరాటాలు చేసి సత్య ధర్మశోధక మండలిని స్థాపించి, పలు సమస్యలపై పోరాడిన మహోన్నతులు పూలే. సామాజిక తత్వవేత్తగా, ఉద్యమకారునిగా, సంస్కరణవాదిగా, సాంఘిక సేవా తత్పరునిగా, బాలికా విద్య ప్రోత్సాహకునిగా, మహిళా హక్కుల పరిరక్షకునిగా, కార్మిక పక్షపాతిగా, దీన జన బాంధవునిగా, లింగ వివక్షకు వ్యతిరేకిగా అణగదొక్కబడిన వర్గాల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారు. సమసమాజ స్థాపన దిశగా నేడు నరేంద్ర మోడీ ప్రభుత్వం అంత్యోదయ లక్ష్యంగా పేదల అభివృద్ధి దిశగా, పూలే బాటలోనే నడుస్తుంది. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మహనీయుని సేవలను స్మరిస్తూ ఘననివాళులు అర్పించడం జరిగింది. కార్యక్రమంలో చిట్టి బాబు కొల్లా, మురారి సుధా, ఆనంద్, కుసుమ, కుమారి, లక్ష్మి, సచివాలయ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తాగునీరు,పారిశుద్ధ్య బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే

**- డీపిఓ సుధాకర్ రావు**

**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** తాగునీరు,పారిశుద్ధ్య బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే అని డీపిఓ సుధాకర్ రావు అన్నారు. పెద్దపంజాణి మండలం రాయలపేట గ్రామ పంచాయతీలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. రోడ్డు ప్రక్కన చెత్త నిల్వ ఉంచరాదని, పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలని, నీటి ట్యాంకులు క్రమం తప్పకుండా శుభ్రం చేసి,



క్లోరినేషన్ చేయించాలని, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలలో పనులు తప్పనిసరిగా ప్రారంభించాలని,హోటల్స్ వారు తప్పనిసరిగా డస్ట్ బిన్స్ ఏర్పాటు చేసుకోవాలని చెత్త ఆరు బయట పడేయరాదని చిత్తూరు జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు అన్నారు. రాయలపేట గ్రామ పంచాయతీ లో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ పనులను డిపిఓ సుధాకర్ రావు తనిఖీ చేశారు. రాయలపేటలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. గ్రామ పంచాయతీలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను తనిఖీ చేసి పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు జారీ చేశారు.మంచినీటి ట్యాంకులను క్రమం తప్పకుండా క్లీనింగ్ చేసి క్లోరినేషన్ చేయించాలని ఎక్కడా పారిశుద్ధ్య నిర్వహణ లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీ ,పంచాయతీ విస్తరణ అధికారి శారదా దేవి, రాయలపేట గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీమతి అరుణ , పంచాయతీ కార్యదర్శి రెడ్డి ప్రకాష్, రాయలపేట గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ఒకటి తరువాత ఒకటి పూర్తి చేస్తున్నాం



**కుప్పం, మేజర్ న్యూస్:** ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీనీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల తో ఒకటి తరువాత ఒకటి పూర్తీ చేస్తున్నా మని మండల టీడీపి అధ్యక్షుడు ప్రేమకుమార్ పేర్కొన్నారు. మల్లానూరు పంచాయతీ క్రిష్ణాపు రం నుండి అడవిబూదుగూరు లింక్ రోడ్డుకు 19 లక్షల రూపాయల రోడ్డు నిర్మాణానికి ప్రేమ్ కుమార్ పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పర్యటించారు. గ్రామస్థులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని పనులు ఒకటి తరువాత ఒకటి ప్రభుత్వం పూర్తి చేస్తూ వస్తున్నదని, నిదుల సమస్య వున్నా, రాష్ట్రంతో పాటు, కుప్పం పురోభివృద్ధికి చంద్రబాబునాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు.ఈ విషయాన్ని యువతీ, యువకులు, యావత్తు ప్రజలు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ పార్టీ అధ్యక్షుడు,రమేష్, యూనిట్ దామోదర్, బూత్ ఇన్చార్జ్ లు నాగార్జున, అశోక్, రాజ్ కుమార్, వెంకటేష్, SC సెల్ అన్నాదొరై, ఎమ్మార్పీఎస్ రాజ్ కుమార్, ప్రకాష్, నాయకులు సాము,వెంకటప్ప, విభుషన్,గోవింద స్వామి, కుట్ట, జయప్రకాష్ ,రాజు, గ్రామస్థులు మొదలైన వారు పాల్గొన్నారు.

## మినీ లారీ బోల్తా



**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** చెన్నై వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తుండగా ప్రమాదం నాయుడుపేట, మేజర్ న్యూస్ నాయుడుపేట లోని మల్లాం కూడలి సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చెన్నై వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి దూసుకెల్లి మినీ లారీ శబోల్తా పడింది. దింతో లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడడంతో అక్కడి వారు ఊపిరి పీల్చుకున్నారు. నిద్రమత్తు కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెప్తున్నారు.

## వ్యవసాయానికి 9 గంటలు విద్యుత్ సరఫరా ఇవ్వాలి



**పలమనేరు, మేజర్‌న్యూస్:** పలమనేరు విద్యుత్ ఏడిఈ కార్యాలయం వద్ద శుక్రవారం ఎస్ ఇ, ఏపీ ఎస్ పి డీసీఎల్, చైర్ పర్సన్ శ్రీనివాస ఆంజనేయ మూర్తి, రిటైర్డ్ జడ్జి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి చిత్తూరు వారు పుంగనూరు డివిజన్ పరిధిలోని అందరూ ఏఈలు ఏ డి ఇ లు, డి ఈ తో రివ్యూ మీటింగ్ జరిగింది. ఈ మీటింగ్ నందు విద్యుత్ వినియోగ దారులకు మెరుగైన సేవలు అందించాలని వినియోగదారులకు జవాబుదారులుగా వ్యవహరించాలని విద్యుత్ సమస్యలను సత్వరగా సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. వినియోగదారులకు వ్యవసాయ సర్వీసులను సత్వరమే అందించాలని 9 గంటల విద్యుత్ సరఫరా వ్యవసాయానికి ఖచ్చితముగా ఇవ్వాలని ఆదేశించారు. వినియోగదారులు తమ సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్1912కీ ఫోన్ చేసి తమ విద్యుత్ సమస్యల్ని పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశానికి డి ఈ పుంగనూరు శ్రీనివాసమూర్తి, పలమనేర్, సదుం సబ్ డివిజనలకు సంబంధించిన ఎస్ ఈ, ఇస్మాయిల్ సాహెబ్, ఏ డి ఇ లు, చిన్నబ్బా,ఏ.ఈ.లు అందరూ పాల్గొన్నారు.

## గర్భవతులకు పోషకాహారం తప్పనిసరి

**గుడిపాల, మేజర్ న్యూస్:** గుడిపాలలోని మరకాల కుప్పం అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి సూపర్ వైజాగ్ స్వర్ణలత దేవి ఆధ్వర్యంలో పోషణ పక్వాడ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణలతాదేవి మాట్లాడుతూ ఏప్రిల్ 8 నుండి 22వ తేదీ వరకు ప్రతి అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో స్వర్లతాదేవి. ఎమ్మెస్ కే నిషా, అంగన్వాడి టీచర్ రోస్లని, రేఖ, వసంతి,హెల్పర్ జయంతి,ఆశా వర్కర్ ప్రీత పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**ఓజిలి, మేజర్‌న్యూస్:** ఓజిలిలో శనివారం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలిపిఎస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ అనిల్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని తెలియజేశారు.

## సీఎంను కలిసిన మాజీ సర్పంచ్ మమత



**తిరుపతి రూరల్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ముత్యాలరెడ్డి పల్లి మాజీ సర్పంచ్ మమత రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థలో విలీనమైన తరువాత ముత్యాలరెడ్డిపల్లి ప్రాంతంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుపతిలో వచ్చిన మార్పుపై ముఖ్యమంత్రికి తన వ్యక్తిగత సమాచారాన్ని తెలిపారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి



**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** మహాత్మ జ్యోతిరావు పూలే 198వజయంతి ఉత్సవాలను జ్యోతిరావు పూలే ఆశయ సాధన సమితిఆధ్వర్యంలో చంద్రగిరి బస్టాండ్ పరిధిలోని టవర్ క్లాక్ వద్ద జ్యోతిరావు పూలే చిత్రపటాన్నికి పూలమాల వేసి పూజలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కె. వెంకటముని మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే అంటరాని తనాన్ని రూపుమాపి, బడుగు, బలహీనులకు అణగారిన వర్గాలకు అనేక రకాలుగా సేవా కార్యక్రమాన్ని అందించిన ఘనత మహాత్మ జ్యోతిరావు పూలేదని చెప్పారు. ప్రధాన కార్యదర్శి రాగూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ సామాజిక ఉద్యమాలకు ఆధ్యుడై స్వేచ్ఛ, సమానత్వం, ఐక్యమత్య సమాజం కోసం అనునిత్యం శ్రమించారు. ఎస్.విశ్వనాథ్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే బలహీన వర్గాలకు చెందినటువంటి మహిళలకు అందరికీ విద్యా విధానం నేర్పించుటలో ఆ రోజుల్లో వీరిదే పైచేయని చెప్పారు. ఎ కేశవులు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటుచేసేందుకు స్థలమును కేటాయించాలని ఎమ్మార్వోను కోరాలని తెలిపారు. ఈకార్యక్రమంలో శంకర్ , రామారావు, మాజీ సర్పంచ్ మురగయ్య, రామ్మూర్తి, సంగీతం దొరస్వామి, వెంకటాద్రి, టి.ఏ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను, ఖాళీ స్థలం పన్నుకు వడ్డీ మాఫీ

**– ఈ నెల 31వరకు అవకాశం**



**నగరి, మేజర్‌న్యూస్:** ఆస్తిపన్ను, ఖాళీ స్థలం పన్నుల బకాయిలను ఏక మొత్తములో చెల్లించిన వారికి 50% (శాతం) వడ్డీ మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసినది. ఆస్తిపన్ను, ఖాళీ స్థలం పన్నులు విషయంలో ఈ ఆర్థిక సంవత్సరం వరకు వున్న పన్ను బకాయి మొత్తాన్ని ఒకేసారి తేది. ఈనెల 31లోగా చెల్లించిన యెడల 50% (శాతం) వడ్డీ మినహాయింపు వర్తిస్తుంది. నగరి పురపాలక సంఘ పరిధిలో పన్ను చెల్లింపుదారులు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని వడ్డీ రాయితీని పొందవలసినదిగా కోరుతున్నాం. ఇందుకోసం పురపాలక సంఘ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడమైనది. సెలవు దినాల్లో కూడా పన్నులు స్వీకరించుటకు కౌంటర్లు పని చేయును. పన్ను చెల్లింపుదారులు పన్నులను పురపాలక సంఘ కార్యాలయ కౌంటర్లలో గాని, వార్డు సచివాలయములో గాని ఆన్ లైన్ ద్వారా చెల్లించవచ్చును. చెక్కులు డీడీలు ద్వారా చెల్లించదలిచిన వారు పురపాలక సంఘ కార్యాలయములో నేరుగా చెల్లించి రశీదు పొందవచ్చుననీ నగరి మున్సిపల్ కమిషనర్ కృష్ణా రెడ్డి తెలిపారు.

## గొప్ప సంఘ సంస్కర్త పూలే



**ఓజిలి, మేజర్‌న్యూస్:** స్వాతంత్రం రాక ముందే సామాజిక సమస్యలపై తిరుగుబాటు చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే అని వారినీ స్ఫూర్తిగా తీసుకొని వారి ఆశయాల సాధనకు వారి అడుగుజాడల్లో నడవాలని బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం పోరాడిన గొప్ప వ్యక్తి మహాత్మా జ్యోతిబాపూలే అని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి ఎంపీడీవో విజయలక్ష్మి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ స్త్రీ విద్య, సమాజిక న్యాయం కోసం పూలే దంపతులు ఎంతో కృషి చేశారన్నారు. ఆ మహనీయుల స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ,పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం

**ఏర్పేడు, మేజర్‌న్యూస్ :** మండలం వికృతమాల గ్రామం అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించరు. ఈ పోషణ పక్వాడ కార్యక్రమం ఏప్రిల్ 22వ తేదీ వరకు అంగన్వాడి కేంద్రాల్లో నిర్వహించనున్నారు. వెయ్యి రోజులు ప్రాముఖ్యత గురించి,గర్భవతి అని తెలిసినప్పటి నుంచి బిడ్డకు రెండు సంవత్సరాల వరకు తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు పోషక ఆహారాన్ని గురించి చెప్పడం జరిగింది. ముఖ్యంగా పోషక ఆహార లోపంతో ఉన్న పిల్లలను గుర్తించి వారికి తగిన విధంగా పోషకాహారం అందేటట్లు చూడాలని, అదేవిధంగా ఆరు సంవత్సరాలు వరకు పిల్లలు బరువు, ఎత్తు, వారి స్థితి విధానాన్ని గుర్తించి సాధారణ స్థితికి వచ్చేటట్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామంలో ఉన్న లబ్ధిదారులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రేణిగుంట ప్రాజెక్టు సిడిపిఓ కృష్ణమాంజలి, సూపర్వైజర్ శ్రీదేవి, అంగన్వాడి కార్యకర్తలు సుమతి,లావణ్య,గౌరీ,తేజ,రామేశ్వరి. సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



## పూలే జీవితం ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకం

**– ఏపీఎస్ఆర్టీసి ఉపాధ్యక్షులు పి.ఎస్ మునిరత్నం**

**కుప్పం, మేజర్‌న్యూస్:** స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలేకి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఆర్టీసి ఉపాధ్యక్షులు ప్రసంగిస్తూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి విశేష కృషిచేసిన మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలన కోసం పూలే అలుపెరుగని పోరాటం చేశారన్నారు. స్త్రీ విద్య కోసం పోరాడిన గొప్ప సంస్కర్త జ్యోతిరావు పూలే అని సమసమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన స్ఫూర్తితో బీసీల అభ్యున్నతికి ఆది నుంచీ కృషిచేస్తూ బీసీల పార్టీగా పేరుగాంచింది తెలుగుదేశం పార్టీ పూలే ఆశయ సాధనకు పునరంకితం కావడమే మనం అర్పించే ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షులు రాజకుమార్, స్టేట్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ సురేష్ బాబు, కుప్పం మండల అధ్యక్షులు ప్రేమ్ కుమార్, జనసేన నియోజకవర్గ అధ్యక్షులు నరేష్, కుప్పం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు మురళి, వెంకటరమణ మున్సిపాలిటీ అధ్యక్షులు సతీష్ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### బడు బలహీన వర్గానికి ఆశాజ్యోతి పూలే

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** జ్యోతిరావు పూలే ఓ సంఘసంస్కర్త బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి అని జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ అన్నారు. శుక్రవారం గంగాధర్ నెల్లూరు మండలం నెల్లె పల్లి గ్రామ సచివాలయంలో జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు నేడు టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని అన్నారు రాష్ట్రంలో బీసీలకు పెద్దపీట వేసి, బీసీలకు 32 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత ముఖ్యమంత్రి కే చెందుతుందని అన్నారు. చంద్రబాబు నాయుడు సారథ్యంలో బీసీలు రాష్ట్రమంతా మరింత అభివృద్ధి పథం లో ముందుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ నాగేంద్ర నాయక్, వెల్ఫేర్ అసిస్టెంట్ హేమావతి, డిజిటల్ అసిస్టెంట్ చిన్నబ్బ, ఏఎన్ఎం సుమతి, గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, ఉప సర్పంచ్ వెంకటపతి రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### పలమనేరులో పూలే జయంతి వేడుకలు

**పలమనేరు, మేజర్‌న్యూస్:** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతి రావ్ పూలే 199వ జయంతి వేడుకలను తెలుగుదేశం పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పట్టణ బీసీ సెల్ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డి










పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి రావ్ చిత్ర పటానికి పూజలు చేసి నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతి రావ్ ను స్మరించుకొని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్వీ బాలాజీ,కిషోర్ గౌడ్, కుట్టి, గిరిబాబు,నాగరాజు, సుబ్రహ్మణ్యం శెట్టి, శ్రీనివాసులు, హరి, చెంగప్ప, లోకేష్ ఆచారి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### జ్యోతిరావు పూలే సేవలు ఆదర్శనీయం

**శ్రీకాళహస్తి అర్బన్, మేజర్ న్యూస్:** సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘసేవకులు జ్యోతీరావ్ గోవిందరావ్ ఫులే ఆదర్శ ప్రాయులని మండల విద్యాశాఖ అధికారిని భువనేశ్వరి అన్నారు. మండల విద్యాశాఖ అధికారి వారి కార్యాలయంలో శుక్రవారం జ్యోతి రావు పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఆనాటి సమాజంలో అసమానతలను రూపుమాపడంలో చొరవ చూపిన మహనీయులు జ్యోతిరావు పూలే దంపతులుగా అభివర్ణించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభా రాణి, సీఆర్ ఎంటీలు మునిమోహన్, గాంధీ, హేమలత, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది లలిత, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు



**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్ :** జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు రెండవ డిపో బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవుల నాయుడు శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు, ఆర్టీసీ సిబ్బందికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ 2వ డిపో మేనేజర్ రూపశ్రీ, ఆర్టిసి అధికారులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉపాధ్యాయున్ని పరామర్శించిన మాజీ ఉప ముఖ్యమంత్రి

**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** మండలంలోని అమ్మపల్లి పంచాయతీ కృష్ణాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యా యులు సుదర్శన్ రాజును అనారోగ్యంతో బాధప డుతున్న ఆయనను మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పరామర్శించారు. ఆరోగ్య విషయాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ పార్టీ మండల అధ్యక్షులు శేఖర్ రాజు, వైస్ ఎంపీపీ కార్తీక్ రెడ్డి, చందు రాజు,ధన శేఖర్, శేషా ద్రి, శోభన్ బాబు ,అర్జునయ్య, వైఎస్ఆర్సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే నేటి తరానికి ఆదర్శం



**రేణిగుంట, మేజర్ న్యూస్:** రేణిగుంటలో జ్యోతి రావు పూలే 198 వ జయంతి వేడుకలు ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు జూలియన్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1827 ఏప్రిల్ 11 వ తేదీన మహారాష్ట్ర లోని సతారా జిల్లాలో జన్మించి ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొన్నారని అన్నారు. స్త్రీలకు విద్యను అందించాలనే ఉద్దేశంతో మహిళలకు విద్య కొరకు ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేసిన వ్యక్తి అని అన్నారు. స్వాతంత్రానికి పూర్వమే మహాత్మా అని పేరుతో పిలవబడ్డారని తెలిపారు.

## ఎన్ఎంయూఏ తరపున ఆర్టీసీ వైస్ చైర్మన్‌కు మెమొరాండం



**కుప్పం, మేజర్‌న్యూస్:** నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వం తయారు చేసిన మెమొరాండంను చిత్తూరు జిల్లా రీజినల్ ఎన్ఎంయూఏ అధ్యక్షులు ఎ.వేలు , జిల్లా వైస్ ప్రెసిడెంట్ కె. ఎస్. వాసులు, జిల్లా కార్యదర్శి జె.వి భాస్కర్, సంయుక్త కార్యదర్శి ఎ. వై రెడ్డి, కుప్పం డిపో ఎన్ఎంయూఏ అధ్యక్షులు స్వామి,డిపో కార్యదర్శి ఇ.జయపాల్, సంయుక్త కార్యదర్శి జి.మునెప్ప, ఎస్. పి. నవీన్, టీవి.కుమార్ తదితరులు శుక్రవారం ఎపిఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీ. ఎస్.మునిరత్నంను మర్యాదపూర్వకంగా కలిసిన సమర్పంచినారు. వైస్ చైర్మన్ మాట్లాడుతూ మెమొరాండంలో ఉన్న ప్రతి అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి, ఇ.జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే జయంతి



**రొంపిచెర్ల, మేజర్‌న్యూస్:** బడుగు, బలహీన వర్గాల ఆశా జ్యోతి, మహిళల జీవితాల్లో విద్యా ప్రాముఖ్యతను సమాజానికి చాటి చెప్పిన మహనీయుడు మహాత్మ జ్యోతి రావు పూలే 198వ జయంతి వేడుకలు రొంపిచెర్లలో ఘనంగా జరుపుకున్నారు. పలు కుల సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జ్యోతి రావు పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యావేత్త డాక్టర్ టి.రఘునాథ్ మాట్లాడుతూ జ్యోతి రావు పూలే అణగారిన వర్గాల వారికి విద్యను అందించారన్నారు. కార్యక్రమంలో రొంపిచెర్ల బీసీ మండల అధ్యక్షుడు జి. నూరేషా, ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి జల్లు గిరిబాబు, సమాచార హక్కు చట్టం కార్యకర్తల సంఘం మండల అధ్యక్షులు ఎన్ ఓబులేసు, సీనియర్ సిటిజన్ ఆర్ రాజన్న హోటల్ మస్తాన్, ఆటో డ్రైవర్లు మురగ, ఖయ్యూం, జగన్ పాల్గొన్నారు.

# ప్రభుత్వం అన్ని విధాల సహకారం... మీ సహకారమేది

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలకు మొండి చేయి చూపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. పరిశ్రమలకు భూములు ఇస్తే తమ ప్రాంతంతో పాటు తాము అభివృద్ధి చెందుతామంటే తమ పరిస్థితి అగమ్య గోచరంగా మరిందని ఆరోపిస్తున్నారు. యువ గళం పాదయాత్రలో తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రస్తుత మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ఇక్కడ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కోసం జిల్లా అధికారులు శిక్షణా కేంద్ర ఏర్పాటు చేసి స్థానిక యువతకు ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలని అధికారులను కోరారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవకర్గంలోని తెలుగుదేశం నాయకులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నామినేటెడ్ పదవులపై.. కూటమిలో కుర్చీల కుమ్ము లాట...?

(మొదటిపేజీ తరువాయి)

చేసుకున్నారు. అటు జనసేన, ఇటు బీజేపీలకు చోటు ఇవ్వడం ఖాయంగా తేలింది. అయితే పార్టీ తమకు అవకాశం ఇస్తుందా, లేదా అనే సందేహంలోనే కేడర్, సీనియర్ నాయకులు ఉన్నారు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావొస్తోంది. ఒక దఫా నామినేటెడ్ పోస్టులు కొన్నింటిని మాత్రమే ప్రకటించారు. తాజాగా మార్కెట్ "కమిటీ చైర్మన్ల"ను ప్రకటించగా, మిగతా కమిటీ సభ్యులతో కూడిన జీవోలు ఒకటి, రెండు రోజుల్లోనే విడుదల కానున్నట్లు సమాచారం. నియోజక వర్గాల్లో స్థానికంగా కీలకమైన పదవి మార్కెట్ కమిటీ చైర్మన్. దీనికోసం తీవ్ర స్థాయిలోనే స్థానిక నేతలంతా పోటీలు పడ్డారు. ఎమ్మెల్యేలు ఆయా మార్కెట్ కమిటీల చైర్మన్ పదవులకు ఉన్న రిజర్వేషన్ ను దృష్టిలో పెట్టుకుని మూడు పేర్లను పార్టీ అధిష్టానానికి పంపారు. కొన్నిచోట్ల ఒక పేరునే సిఫార్సు చేశారు. ఎమ్మెల్యేల నుంచి అందిన జాబితాలన్నింటి పైనా అక్కడక్కడ అభిప్రాయ సేకరణ జరిపారు.

**రాజకీయంగా ఖర్చుపెట్టిన డబ్బులు తిరిగి సంపాదించాలంటే పదవి తప్పనిసరి...** రాజకీయంలోకి ఎప్పుడు వచ్చింది కాదు అన్నా... ఎంత ఖర్చు పెట్టాం ...ప్రజల్లో ఎంతక్రేజీ సంపాదించామన్నది కావాలి, ఆ ఖర్చుపెట్టిన డబ్బులు ఇప్పటివరకు ఎంత సంపాదించామ్ ఇంకా ఎంత సంపాదించాలి అనే టార్గెట్ తో రాజకీయ పదవుల ఆశిస్తున్నారు తప్ప ప్రజలను బాగుపరచాలి తన సొంత గ్రామాన్ని గాని ,పట్టణాన్ని గాని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని దృక్పథం ఎవరికి లేదు, లక్షలు ఖర్చు పెట్టామా కోట్లు దొబ్బేసామా అన్న చందా గానే ప్రతి ఒక్కరూ రాజకీయంలోకి వస్తున్నారు తప్ప పదిమంది బాగుండాలి అందులో నేనుండాలి అనే సంకల్పంతో ఎవరు లేరు. ఇప్పుడున్న నాయకులు కార్యకర్తలు వారికి తోచిన విధంగా రాజకీయ పెద్దల దగ్గర పదవుల కోసం ఆరాటపడుతున్నారు పదవులు వచ్చిన తర్వాత ఎంత సంపాదించుకోగలం అనే కోణంలో ప్రతి నాయకుడు ఆలోచిస్తాడు అదే పరంపరలో ఏదో ఒక పదవి దక్కితే చాలు తర్వాత ఆ పదవిని అడ్డుపెట్టుకొని ఉన్న నాలుగు సంవత్సరాలలో ఎంతో కొంత సంపాదించి నాలుగు రాళ్లు వెనకేసుకోవాలని ఆశపడుతున్నారు. ఇదాలా ఉంటే సహకార పదవులపై ఆశ... ఇప్పటికే సహకార సంఘాల్లో త్రిసభ్యకమిటీల కోసం నియోజకవర్గాల వారీగా సిట్టింగ్ ఎమ్మెల్యేలు జాబితాలను రూపొందించి ప్రభుత్వం వద్దకు చేర్చారు. కొన్ని సహకార సంఘాల త్రిసభ్యకమిటీల్లోను తమకు చోటు ఇవ్వాలని బీజేపీ, జనసేన పట్టుపడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో జనసేనతోపాటు బీజేపీ అనుకూలురు త్రిసభ్య కమిటీల్లో చోటు కోసం గట్టిగానే ఒత్తిడి చేస్తున్నారు. ఇప్పటికే జనసేనా పార్టీ నాయకులు కొందరు మంత్రి నాదెండ్ల మనోహర్ మద్దతు కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే దాదాపు పదికి పైగా సొసైటీ కమిటీల్లో జనసేనకు అవకాశం దక్కవచ్చని భావిస్తున్నారు. ఆ మేరకు జనసేన నేతలు తమ పార్టీ పక్షాన ఎమ్మెల్యేలకు సిఫార్సులు అందజేశారు. మరోవైపు వివిధ కార్పొరేషన్ల భర్తీ ఇంకా జరగాల్సి ఉన్నందున వాటిలోనైనా చోటు ఇవ్వాలని పట్టుపడుతున్న వారి సంఖ్య భారీగానే పెరుగుతోంది. తెలుగు దేశంలో రాష్ట్ర పార్టీలో ఉన్న పలువురు నామినేటెడ్ పోస్టు కోసం పట్టు పడుతున్నారు. గత ఐదేళ్లల్లో పార్టీ వ్యవహారాల్లోను వైసీపీకి వ్యతిరేకంగా గట్టిగా నిలబడిన వారిలో కొందరు తమకు పదవులు వస్తాయని ఎదురుచూస్తున్నారు. కేవలం ఒక సామాజిక వర్గ కోణంలో చూడకుండా పార్టీ కోసం ఎంతమేర పని చేశామో విశ్లేషించి తమకు అవకాశం ఇవ్వాలని పార్టీ పెద్దలకు విజ్ఞప్తి చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు వారి పేర్లను పరిగణనలోకి తీసుకోవాలన్న కోణంలోనే ఇప్పటికే కేడర్ పట్టు దలతో ఉంది. మార్కెట్ కమిటీలు దక్కని సీనియర్లకు వివిధ కార్పొరేషన్లలోనైనా చోటు ఇవ్వాల్సిందేనని పట్టుపడుతున్నారు. ఉమ్మడి తిరుపతి జిల్లా కూటమి నేతలను ఏ పదవులు ఎవరిని వరిస్తాయో వేచిచూడాల్సి ఉంది మరీ.

## ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని ఐతేపల్లి, అగరాలరెండు పంచాయతీలలో ఇప్పటివరకు 85 మంది మహిళలు శిక్షణ కార్యక్రమానికి పేర్లను నమోదు చేసుకున్నారు. మహిళల ఆర్థిక ఎదుగుదల కూటమి ప్రభుత్వ లక్ష్యం పులివర్తి నాని అన్నారు. ప్రతి ఒక్క మహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉచిత కుట్టుశిక్షణ అనంతరం కుట్టుమిషన్లను ఉచితంగా అందిస్తామని పులివర్తి నాని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ బీసీ కార్పొరేషన్ సహకారంతో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఐతేపల్లెలో ప్రారంభించామని ఆయన తెలిపారు. గత ఐదు సంవత్సరాల వైసిపి ప్రభుత్వ పాలనలో 30 సంవత్సరాల అభివృద్ధి వెనక్కు వెళ్లిందని అన్నారు. మహిళల ఆర్థిక ఎదుగుదల కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మహిళలకు వివిధ రకాల ఉపాధి అవకాశాలను కల్పిస్తూ వారి ఆర్థిక ఎదుగుదలకు దోహదపడుతున్నామన్నారు. అందులో భాగంగానే ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఏపీ బీసీ కార్పొరేషన్ వారి సహకారంతో ఐతేపల్లి, ఆగరాల పంచాయతీలలో ప్రారంభించినట్లు తెలిపారు. మహిళలు ఇంటి వద్ద ఉండి తమ సంపాదనను పెంపొందించుకునేందుకు ఈ ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చిన అనంతరం కుట్టు మిషన్లను ఉచితంగా అందించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.





## ప్రణాళికాబద్ధంగా టీడీఆర్ బాండ్ల ప్రక్రియ జరగాలి : కమిషనర్

**తిరుపతి బ్యూరో,మేజర్ న్యూస్:**

తిరుపతి నగర పాలక సంస్థలో టిడిఆర్ బాండ్ల ఆన్లైన్ రిజిస్ట్రేషన్, నమోదు, తదితర అంశాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించా లని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో జరుగుతున్న టిడిఆర్ బాండ్ల మేళాను శుక్రవారం సాయంత్రం కమిషనర్ పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని ఆన్లైన్ అయ్యాయి? ఎవరెవరి దరఖాస్తులు ఏ స్టేజ్ లో ఉన్నాయని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దరఖాస్తుల నమోదు ప్రక్రియా ఆలస్యం అవుతోందని అన్నారు. ఆయా మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించిన అధికారులు ప్రజలకు ఫోన్ చేసి వారి వివరాలు స్వయంగా సేకరించా లని ఆదేశించారు. సెలవు రోజుల్లో కూడా ఉండి ఆన్లైన్ చేయించాలని అన్నారు. ఈ నెల 20 వ తేదీ లోపు అన్ని టిడిఆర్ బాండ్లు గిఫ్ట్ డీడ్ స్టేజ్ కు రావాలని, అలసత్వం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డి.సి.పి. మహాపాత్ర, ఏసిపిలు బాలాజి, మూర్తి, టిపిబిఓలు, రోడ్డు ఇంచార్జులు, సెక్రటరీలు ఉన్నారు.



జనం కోసమే నేటి దినపత్రిక సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం. మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232

ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116